## నల్లగొండలో భారీ వాహనాలపై ఆంక్షలు -- ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి: సీఐ మహాలక్ష్మయ్య



**నల్లగొండ బ్యూరో, శుభోదయ డైనమిక్** పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, పాఠశాలల ప్రారంభం, రోడ్డు ప్రమాదాల నివారణ దృష్ట్యా భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించినట్లు ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య తెలిపారు.ఉదయం 8 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు లారీలు, ట్రాక్టర్లు వంటి భారీ వాహనాలకు పట్టణంలో ప్రవేశం అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, అతివేగం, అనధికార పార్కింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ రద్దు, వాహనాల సీజ్ వంటి చర్యలు తప్పవని పేర్కొన్నారు.ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించి పోలీసులకు సహకరించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.ం

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక లక్ష్యం: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక విజయవంతంగా అమలవుతోందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.చివేంల మండలం గుంజులూరు గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న కలెక్టర్, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, పరిశుభ్రత, వర్షాకాల వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో పంటల సాగు చేపట్టాలని సూచించారు.తడి--పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని, బడిబాట ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెంచాలని కోరారు. గ్రామ సమస్యలపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్గొండ బ్యూరో, శుభోదయ డైనమిక్** జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించిన ఆయన రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సూపరింటెండెంట్ కార్యాలయంలో హాజరు రిజిస్టర్లు పరిశీలించిన అనంతరం వెల్‌నెస్ సెంటర్‌లో రోగులతో మాట్లాడి చికిత్స, మందుల లభ్యతపై వివరాలు తెలుసుకున్నారు. కొన్ని మందులు అందుబాటులో లేవని రోగులు చెప్పడంతో వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సరఫరా చేయాలని ఆదేశించారు.త్వరలో ప్రారంభించనున్న డీ-అడిక్షన్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్, మాదకద్రవ్య వ్యసన బాధితులకు అవసరమైన కౌన్సిలింగ్, చికిత్స సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం ఎంసీహెచ్ వార్డును సందర్శించి గర్భిణీ స్త్రీలతో మాట్లాడి వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఫార్మసీ విభాగంలో మందుల నిల్వలు, పంపిణీ విధానాన్ని సమీక్షించిన ఆయన, ప్రతి రోగికి నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ నేత నరసింహారావు, డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనలో సూర్యాపేట మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి గుర్తింపు: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్** ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణలో సూర్యాపేట మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.మున్సిపాలిటీ 16వ వార్డు సభలో పాల్గొన్న కలెక్టర్, ప్లాస్టిక్ వ్యర్థాల నుండి ఇటుకల తయారీ వంటి వినూత్న కార్యక్రమాలను ప్రశంసించారు. తడి--పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం తప్పనిసరని సూచించారు.ఎస్పీ నరసింహ మాట్లాడుతూ మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ డయల్ 100, 112కు కాల్ చేస్తే వెంటనే పోలీసులు స్పందిస్తారని తెలిపారు. వేధింపులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## మా ఇంటిని కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నం చేస్తున్నారు



ఇంటి నిర్మాణం అడ్డుకుంటె మాకు చావు తప్ప మరొక దారి లేదు

**శుభోదయ డైనమిక్ న్యూస్, జూన్ 06, సూర్యాపేట** : సూర్యాపేట పట్టణంలోని భగత్ సింగ్ నగర్ లో సర్వే నెంబరు 219 లో 200 గజాల స్థలంలో నిర్మాణం చేస్తున్న ఇంటికి మున్సిపాలిటీ అధికారులు వచ్చి నిర్మాణం ఆపాలని తెలియజేస్తున్నారని అందువల్ల తమ కుటుంబ సభ్యులం తీవ్రమైన మనోవేదన చెందుతున్నామని, తనకు ఆత్మహత్యే శరణ్యమని దొంతగాని వసంత అన్నారు. శనివారం నిర్మాణం జరుగుతున్న తన ఇంటి వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో బాగ్యరాజ్ , భీమార్జున్ రెడ్డి లతో కలిసి మాట్లాడుతూ తాను 2020లోనే ఇక్కడ స్థలం కొని ఇంటి నిర్మాణం మొదలు పెట్టామని ప్రతి సంవత్సరము మున్సిపాలిటీ కి ఇంటి పన్ను కడుతున్నామని, అన్ని రకాల డాక్యుమెంట్ లు వున్నాయని చెప్పారు. కొందరు కావాలని కోర్టులో కేసు వేశారని అయితే తాము 2025లో కోర్టులో కేసు గెలవడం జరిగిందని , తర్వాత ఇంటి నిర్మాణం చేస్తున్నామని, అయితే ఇటీవల మున్సిపాలిటీ అధికారులు వచ్చి నిర్మాణం చేయడానికి అనుమతులు లేవని హెచ్చరిస్తున్నారని వారు తెలిపారు. ఈ సందర్భంగా భాగ్యరాజ్ మాట్లాడుతూ 1982 నుంచి 2020 వరకు ఈ స్థలం సురకంటి భీమార్జున్ రెడ్డి తల్లి విజయమ్మ పేరు మీద ఉందని 2020లో దారోజు శారదకి తరువాత దొంతగాని వసంతకు అమ్మడం జరిగిందని అన్నారు. ఇంటి నంబర్ వచ్చిందని, మున్సిపాలిటీలో రెగ్యులర్ గా ఇంటి పన్ను కడుతున్నామని చెప్పారు. అయితే కొందరు కావాలని తమను వేధిస్తున్నారని అటువంటి వారు కోర్టు కేసులో కూడ ఎన్నడూ హాజరు కాలేదని కానీ ఇటీవల మున్సిపాలిటీకి వెళ్లి అధికారులను బెదిరించి నిర్మాణం చేయకుండా అడ్డుకుంటున్నారని వారు తెలిపారు. కాబట్టి తమకు న్యాయం చేయాలని వారు అన్నారు. ఇప్పటికే ఇంటి నిర్మాణం కోసం చాలా ఖర్చు చేశామని, నిర్మాణం చేయడం అడ్డుకుంటే తమ కుటుంబానికి ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరొక దారి లేదని ఆమె చెప్పారు.

## వర్షాకాల వ్యాధుల నివారణకు శుభ్రతే




## ఆయుధం: కౌన్సిలర్ దేప రమ్య రాజు

**చౌటుప్పల్,శుభోదయ డైనమిక్** చౌటుప్పల్ మున్సిపాలిటీ 10వ వార్డులో నిర్వహించిన ప్రజా అవగాహన, స్వచ్ఛత సమావేశంలో కౌన్సిలర్ దేప రమ్య రాజు పాల్గొన్నారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు.వార్డులో ప్రతిరోజూ దోమల నివారణ మందు పిచికారీ, డ్రైనేజీల శుభ్రత పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు. ప్రజలు కూడా స్వచ్ఛత కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

## ఘనంగా కాంగ్రెస్ నాయకుడు తుంగ కుమార్ జన్మదిన వేడుకలు



**ఆలేరు,శుభోదయ డైనమిక్** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తుంగ కుమార్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, దళిత-బహుజన సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు ఆయనకు జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. సమాజ సేవలో మరింత ముందుకు సాగుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## కెసారం, కాసరబాద గ్రామాల్లో భరోసా టీం అవగాహన కార్యక్రమం

**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక (90 రోజుల కార్యక్రమం)లో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు సూర్యాపేట రూరల్ పరిధిలోని కెసారం, కాసరబాద గ్రామాల్లో పోలీస్ భరోసా టీం అవగాహన సదస్సులు నిర్వహించింది.మహిళా భద్రత, లింగ వివక్షత, బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టం, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 1098, 181, 1930 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని సూచించారు.కార్యక్రమంలో భరోసా సెంటర్ సిబ్బంది, స్థానిక సర్పంచ్‌లు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు



## కొత్త పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలి : బీఆర్ఎస్ నాయకుడు అరిబండి సురేష్ బాబు



**నేరేడుచర్ల,శుభోదయ డైనమిక్** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త పెన్షన్లను వెంటనే మంజూరు చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించాలని బీఆర్ఎస్ పార్టీ నేరేడుచర్ల మండల మాజీ అధ్యక్షుడు అరిబండి సురేష్ బాబు డిమాండ్ చేశారు.శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, జూన్ 2వ తేదీ నుంచి కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులు స్వీకరించి మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఇప్పటి వరకు వాటి అమలుపై స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు.ప్రభుత్వ ప్రకటనలను నమ్మి ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని, కానీ వారికి ఎలాంటి ప్రయోజనం కలగడం లేదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కొత్త పెన్షన్ల మంజూరుపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలను అయోమయానికి గురిచేసే ప్రకటనలకు బదులుగా హామీల అమలుపై దృష్టి సారించాలని సూచించారు.కొత్త పెన్షన్ల విడుదల విషయంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ తరపున ఆయన కోరారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్ పంపిణీ



**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్ నగర్** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డ్ మల్లన్న నగర్‌కు చెందిన వంగాల జ్యోతి అనారోగ్య కారణాల వల్ల ఆసుపత్రిలో చికిత్స పొందగా, వారికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో మంజూరైన రూ.51,000/- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్ధిదారురాలికి రెండో వార్డ్ కౌన్సిలర్ కోడి జ్యోతి ఉపేందర్ యాదవ్ అందజేశారు.

## తల్లిదండ్రులు పిల్లలకి ఈత నేర్పించాలి. వెంకట కృష్ణయ్య డివిషనల్ ఇంజనీర్



**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్ నగర్** హుజూర్నగర్ గడ్డి రెడ్డి ఫంక్షన్ హాల్ స్విమ్మింగ్ పూల్ నందు క్రీడా ప్రోత్సాహకులు జాతీయ కబడ్డీ క్రీడాకారులు ఎన్ వెంకట కృష్ణయ్య డివిజనల్ ఇంజనీర్ ఆపరేషన్ హుజూర్నగర్ టిజిఎస్పిడిసిఎల్ వారు సూర్యాపేట జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలు పెట్టి అనేకమందిని ప్రోత్సహించి స్విమ్మింగ్ ఆవశ్యకత గురించి వివరించినారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం బేతవోలు చెరువు కట్ట పైన సభ్యులందరి సమక్షంలో డి ఈ వెంకట కృష్ణయ్య ని బేతవోలు స్విమ్మింగ్ బ్యాచ్ అసోసియేషన్ అధ్యక్షులు రణబోతుల లింగారెడ్డి పలువురు ఘనంగా సత్కరించినారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం స్విమ్మింగ్ నేర్చుకోవడం ఆరోగ్యం మరియు విపత్కర పరిస్థితిలో తనను తాను కాపాడుకోని ఇతరుల ప్రాణాలు కూడా కాపాడవచ్చు అని అందుకనే పిల్లలందరికీ ఈత నేర్పించాలని తల్లిదండ్రులను కోరినారు. ఈ కార్యక్రమంలో అక్కినపల్లి జానకి రామాచారి ఆకుల రాము బుడిగ వెంకన్న వల్లపు రెడ్డి వెంకటరెడ్డి వీరారెడ్డి కోటిరెడ్డి ఆనందరావు మోదుగు కృష్ణారెడ్డి కొండయ్య బిక్షం రవి శ్రీను వేణు సైదారావు కొండా శ్రీను వీరస్వామి ప్రసాదు శశిధర్ వెంకన్న కీతా శీను రాజశేఖర్ మోహన్ రెడ్డి అనేకమంది సిమ్మర్స్ పాల్గొన్నారు

## డిఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం చేసిన దగ్గుపాటి రాజేష్

అత్యవసర సమయంలో రక్తదానం చేసి గొప్ప మనసు చాటుకున్న దగ్గుపాటి రాజేష్‌లి



**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్ నగర్ :** హుజూర్‌నగర్‌లోని సింధు హాస్పిటల్‌లో అమరవరం గ్రామానికి చెందిన ఓ మహిళకు అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమవడంతో, సమాచారం అందుకున్న వెంటనే స్పందించి యువకుడు దగ్గుపాటి రాజేష్ స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా దగ్గుపాటి రాజేష్ మాట్లాడుతూ, “ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత. హుజూర్‌నగర్ ప్రాంతంలో అత్యవసర పరిస్థితుల్లో రక్తం కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఇక్కడ శాశ్వత బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది” అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సామాజిక సేవలో ఎప్పుడూ ముందుండే తన బాబాయ్ దగ్గుపాటి బాబురావు సేవా స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. అనంతరం డీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ లిదగ్గుపాటి బాబురావు మాట్లాడుతూ, “రక్తదానం అనేది లిమహాదానం. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. యువత ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయం. హుజూర్‌నగర్ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు కోసం సంబంధిత అధికారుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లేందుకు కృషి చేస్తాం” అని తెలిపారు. దగ్గుపాటి రాజేష్ చేసిన ఈ సేవా కార్యక్రమాన్ని పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, ట్రస్ట్ సభ్యులు మరియు స్థానిక ప్రజలు అభినందించారు.

